
సాక్షి
సూర్యాపేట
సోమవారం, 13, అక్టోబర్, 2025



గోదాంలో అగ్ని ప్రమాదం

మిర్యాలగూడలోని హనుమాన్‌పేటలో ఎలక్ట్రికల్ షాపు గోదాంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. - 8లో



ఆశలు.. అడియాసలు

మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో చేపట్టిన నక్కలగండి ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	589.80 అడుగులు
ఇన్‌ఫ్లో	:	85,118 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	85,118 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,454 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,108 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళిని హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసినందున సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

సూర్యాపేట అర్బన్ : దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్.గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది దాడికి పాల్పడడం హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడి, బెదిరింపు ధోరణితో వ్యవహరించడం మతోన్మాదానికి నిదర్శనమని పేర్కొన్నారు. సీజేఐపై దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ ఏకమై దోపిడీ వ్యవస్థపై పోరాడాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం గావించి స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం నిత్య కల్యాణం జరిపి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బెస్ట్‌కు నిధులేవీ?

మూడేళ్ల నుంచి విడుదల చేయని ప్రభుత్వం

- పెండింగ్ బిల్లులు రూ.8.90 కోట్లు
- వెంటనే విడుదల చేయాలంటున్న స్కూళ్ల యాజమాన్యాలు
- ఇటీవల కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- ఈ స్కీం కింద విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1,300 మంది



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, కేవీపీఎస్ నాయకులు (ఫైల్)

నాగారం : పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీంకు నిధులు కరువయ్యాయి. ఈ స్కీం కింద ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులను లాటరీ విధానంలో ఎంపిక చేసి ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. వారి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేయడం లేదు. దీంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు దసరా సెలవుల అనంతరం పిల్లలను బడుల్లోకి రానీయడం లేదు. దీంతో తమ పిల్లల చదువులు అటకెక్కాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

విద్యా సంవత్సరం	చెల్లించాల్సిన బిల్లులు (రూ.కోట్లలో..)
2022-23	1.80
2023-24	3.91
2024-25	3.19

మూడేళ్లుగా నిరీక్షణ

బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం ఎంపిక చేసిన పేద విద్యార్థులకు విద్యనందించే ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలకు మూడేళ్లుగా బిల్లులు అందక ఆందోళనకు గురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ప్రైవేట్ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు రెసిడెన్షియల్, డేస్కాలర్ కింద 1వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన అందిస్తుంది. అయితే మూడేళ్ల నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైౖ పాఠశాలలకు నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ గురువారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి వారి తల్లిదండ్రులు, కేవీపీఎస్ నాయకులు ఆందోళనకు దిగారు.

ఆరు పాఠశాలల ఎంపిక

జిల్లాలో ఆరు ప్రైవేట్ పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు 1,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.42 వేలు, నాన్ రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.28 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం ఇచ్చే ఈ డబ్బులకు ఆ బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద బోధించే పాఠశాలలు ప్రతి విద్యార్థికి ఏటా టెస్ట్ బుక్స్‌తోపాటు నోట్ బుక్కులు, రెండు జతల యూనిఫామ్, రెండు జతల షూ ఇవ్వడంతో పాటు 5వ తరగతి నుంచి హాస్టల్ వసతి కల్పించి భోజనం అందిస్తున్నాయి. ఆయా పాఠశాలలకు మూడేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో రూ.8.90 కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి.

తల్లిదండ్రుల ఆవేదన

పిల్లలను అనుమతించకపోవడంతో వారం తా ఇళ్ల వద్దనే ఉండాల్సి వస్తోందని, తరగతులకు దూరం కావడంతో చదువుల్లో వెనుకబడతారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే అభ్యసన సామర్థ్యం, ముఖ్యంగా పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో పదో తరగతిలో ప్రత్యేక తరగతులు మొదలయ్యాయి. ఇప్పుడు బడులకు వెళ్లకుంటే విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రభుత్వ నిధులు విడుదల చేసి, పిల్లలను పాఠశాలలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేసి ఆదుకోవాలి



బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైన పాఠశాలలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలి. మూడేళ్లగా నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు వసతితో పాటు భోజన ఖర్చులు కూడా పాఠశాల యాజమాన్యాలే భరిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలి.

– కోట గోపి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



దామోదర్‌రెడ్డి సంతాప సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

గోదావరి జలాలు.. దామన్న చలవే

- ఎస్సారెస్పీ స్టేజ్–2 కోసం 40 ఏళ్ల క్రితమే దామోదర్ రెడ్డి పోరాటం
- ప్రజా జీవితంలో ఉండి ఆస్తులు త్యాగం చేశారు
- ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి
- ఆర్డీఆర్ సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు



ఎస్సారెస్పీ రెండో దశకు దామోదర్‌రెడ్డి పేరు పెట్టాలని సీఎంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం : ఆనాడు కరువు, కాటకాలతో ఎడారిగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పచ్చని పంటలు పండాలని 40 ఏళ్ల క్రితమే ఎమ్మెల్యేగా ఎన్నికైన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి గోదావరి జలాలను తీసుకురావడానికి పెద్ద ఎత్తున ఉద్యమించారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తిలో ఆదివారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ముందుగా దామోదర్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ శ్రీరాంసాగర్ ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి ఆర్డీఆర్ కృషి ఎనలేదిఅని అన్నారు. దామన్న.. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసి వేలాది ఎకరాల భూములు, ఆస్తులను ప్రజలు, కార్యకర్తల కోసం త్యాగం చేశారని పేర్కొన్నారు. ఈ జిల్లాలో రాజకీయ కక్షలు, హత్యాయత్నాలు, వివాదాలు, దాడులు, విపత్కర పరిస్థితులను ఎదుర్కొని కార్యకర్తలను కాపాడి కాంగ్రెస్ జెండాను నిలబెట్టిన ఘనత ఆర్డీఆర్‌ది అని అన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించి ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటూ టైగర్ దామన్నగా గుర్తింపు పొందారని కొనియాడారు. తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుల సామేల్‌కు చేతిలో రూ.50 వేలు లేకున్నా 50వేల మెజార్టీతో గెలవడానికి కారణం దామన్న వేసిన పునాదులేనని పేర్కొన్నారు.

ఆర్డీఆర్ కృషితోనే ఎస్సారెస్పీ స్టేజ్–2..

రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు శ్రీరాంసాగర్ జలాల కోసం రక్తతర్పణం చేసిన ఘనత ఆర్డీఆర్‌దే అని కొనియాడారు. దామోదర్‌రెడ్డి కృషి ఫలితంగానే ఎస్సారెస్పీ స్టేజ్–2 పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాల్వల మరమ్మతుకు నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సొంత ఆస్తులను త్యాగం చేసి పార్టీని బతికించిన ఘనత దివంగత నేత ఆర్డీఆర్‌ది అని అన్నారు. దామన్న కుమారుడు సర్వోత్తంరెడ్డికి అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్ జెండాను కాపాడిన ఘనత రాంరెడ్డి సోదరులకే దక్కిందన్నారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి, ఆ పార్టీ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీలను ఢీకొన్నది రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఇద్దరు అన్నదమ్ములే అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ రఘువీర్‌రెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేలు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పద్మావతి, వేముల వీరేశం, బాలునాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, మట్టా రాఘమయి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, మహిళా అధ్యక్షురావు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, చకిలం రాజేశ్వర్‌రావు, సంకెపల్లి కొండల్‌రెడ్డి, గుడిపాటి నర్సయ్య, తొడుసు లింగయ్య, ఆకుల బుచ్చిబాబు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం ఆర్డీఆర్ పోరాటం : డిప్యూటీ సీఎం భట్టి




నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేదల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం పోరాడారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ అంటేనే నేను, నేను అంటేనే కాంగ్రెస్ అనేలా దామోదర్‌రెడ్డి నిలబడ్డారని కొనియడారు. యువత రాజకీయాల్లోకి రావడానికి దామోదర్‌రెడ్డియే స్ఫూర్తి దాయకమన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షానే ఉన్నారని కొనియడారు. ఆయన ఆశయాలు, ఆలోచనలను ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని.. అదే ఆయనకు ఘనమైన నివాళి అన్నారు.



సభకు భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు

సాగర్ నాలుగు గేట్లు ఓపెన్



నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

- కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 85,118 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా ఎన్నెస్పీ అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్ట్‌గేట్లను ఎత్తి 32,316 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 33,454 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీకి 19,348 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.80 అడుగులుగా ఉంది.



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

పర్యాటకుల సందడి

సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతుండటంతో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని, ఎత్తిపోతల జలపాతాలను చూసేందుకు ఆసక్తి కనబర్చారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ ఉన్న బౌద్ధ మ్యూజియాన్ని సందర్శించారు. దాంతో పాటు బుద్ధవనం వద్ద కూడా పర్యాటకుల సందడి నెలకొంది.

యాదగిరీశుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో విశేష పూజలు కొనసాగాయి. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన జరిపించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించి, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర, సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రి సమయంలో శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి, ఆలయ ద్వారబంధనం చేశారు.

రేపు బుద్ధవనంలో ధమ్మవిజయం వేడుకలు



నాగార్జునసాగర్: ఈ నెల 14న ఉదయం 11 గంటలకు బుద్ధవనంలోని సమావేశ మందిరంలో ధమ్మవిజయం వేడుకలు నిర్వహిస్తున్నట్లుగా బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధుడి ధమ్మంపట్ల ఆకర్షితుడైన సామ్రాట్ అశోకుడు ఇకపై దిగ్విజయం స్థానంలో, దమ్మ విజయం చేకూరేలా చేస్తానని శాసనాల ద్వారా ప్రకటించిన సందర్భానికి గుర్తుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూణే యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మహేశ్ దియోకర్ దమ్మవిజయ విశిష్టతను వివరిస్తారని తెలిపారు. ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, హైద్రాబాద్ రెడ్డి మహిళా కళాశాల ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, ఎంజేపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత హాజరు కానున్నట్లు తెలిపారు. స్థానికులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అవినీతిని ప్రశ్నించేలా..

- సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు పాఠాలు
- ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అవగాహన సదస్సులు
- శనివారంతో ముగిసిన 'చట్టం' వారోత్సవాలు



తిరుమలగిరి ప్రభుత్వ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఆర్టీఐ ప్రతినిధి

తిరుమలగిరి (తుంగతుర్తి): విద్యార్థులు, యువకులు కళాశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకోవడమే కాకుండా అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా సమాజంలో పెరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించేలా సమాచారం హక్కు చట్టం (ఆర్టీఐ)–2005 వారోత్సవాలు చేపట్టింది. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చేపట్టి సదస్సులు శనివారంతో ముగిశాయి. తద్వారా ప్రభుత్వాలు పారదర్శక పాలన అందించేలా ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని ఎలా వినియోగించుకోవాలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు అవగాహన కల్పించారు.

మార్పు తేవాలనే లక్ష్యంతో..

ప్రస్తుత పోటీ, డిజిటల్ ప్రపంచంలో విద్యార్థులు, యువకుల్లో అవినీతి, అక్రమాలపై ప్రశ్నించాలన్న స్పృహ కరువైంది. ఎవరికి ఏమైతే మనకేంటి అనే ఆలోచనలో విద్యార్థులు, యువకులు ఉంటున్నారు. ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్లకే పరిమితమవుతూ సమాజంలో ఏ జరుగుతున్నా చూసి వదిలేయడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువకుల్లో మార్పు తేవాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి సమాచార హక్కు చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నిర్ణయించి వారోత్సవాలు చేపట్టింది.

పోరాడితేనే సమాజానికి మేలు

సమాచార హక్కు చట్టం సామాన్యుల ఆయుధం.. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఎక్కడ ఏమి జరిగినా సమాచారం తెలుసుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ అస్త్రాన్ని సంధించి అవినీతి, అక్రమాలపై పోరాడితేనే సమాజానికి మేలు జరగనుంది. ఈ చట్టంపై నేటి విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పిస్తూ ప్రశ్నించేతత్వం అలవాటు చేస్తూ దాని ప్రత్యేకతను వివరించి వారిని మేల్కొలిపేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వర్సిటీలు, కళాశాలల్లో శనివారం వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ చట్టం విశిష్టత, ఉద్దేశాలు, ప్రయోజనాలు, దీనికింద అడగాల్సిన, అడగకూడని సమాచార వివరాలను వివరించారు. ఆర్టీఐ కింద దరఖాస్తు చేసే విధానం, చెల్లించాల్సిన రుసుం, సమాచారం ఇవ్వకుంటే సంప్రదించాల్సిన విభాగాలు, అధికారుల గురించి కూడా తెలియజేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 15,612 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అక్రమాలను నిలదీయకుంటే నష్టమే..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండడం, డిజిటల్ ఉపకరణాలను ఎక్కువగా వినియోగిస్తుండడంతో విద్యార్థులు, యువకుల్లో క్రమేణా ప్రశ్నించే తత్వం తగ్గుతోంది. వివిధ పథకాలు, కార్యక్రమాలు, పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని తెలిసినా వారు స్పందించడం లేదని వివిధ అధ్యయనాల్లో తేలింది. పట్టభద్రులైన యువకులు సైతం అవినీతి, అక్రమాల గురించి నిలదీయకపోతే సమాజానికి నష్టం జరుగుతుందని భావించిన ఉన్నత విద్యాముడలి సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను విద్యార్థులు, యువకుల్లోకి తీసుకెళ్లాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ వారోత్సవాలు నిర్వహించింది.

అవగాహన కల్పించాం



సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతిలో పదునైన ఆయుధం. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఉన్నత విద్యామండలి ఆదేశాలతో చట్టం వారోత్సవాలు నిర్వహించి చట్టంపై అవగాహన కల్పించాం. ప్రభుత్వ పథకాలు, పనులు ఎంతవరకు వచ్చాయో ఈ చట్టం ద్వారా ప్రజలు సమాచారం తెలుసుకోవచ్చు. పారదర్శక పాలనతోనే అవినీతిరహిత సమాజం ఏర్పడుతుంది. ఈ చట్టాన్ని ఉపయోగించుకుని విద్యార్థులు, యువత అవినీతి, అక్రమాలపై ప్రశ్నించాలి.

– బి.మృత్యుంజయ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తిరుమలగిరి

ఇట్టమళ్ల ఏసోబ్ మృతి పార్టీకి తీరనిలోటు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



ఏసోబ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జాన్‌వెస్లీ

చివ్వెంల: సీనియర్ నాయకుడు ఇట్టమళ్ల ఏసోబ్ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. చివ్వెంల మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఇట్టమళ్ల ఏసోబ్ కుటుంబాన్ని ఆదివారం జాన్‌వెస్లీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఏసోబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏసోబ్ చేసిన కృషి, సేవలు ఎనలేనివన్నారు. చివ్వెంల మండల తొలి ఎంపీపీ ఏసోబ్ అనేక అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. కుల నిర్మూలన కోసం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిన ఏసోబ్ ఆశయాల సాధనకు కృషిచేయాలన్నారు. బీజేపీ మతోన్మాదం, కుల తత్వాన్ని పెంచిపోషిస్తుండడం వల్లే భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి, హర్యానాలో ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్య లాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎండీ అబ్బాస్, డీజీ నర్సింగరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టపల్లి సైదులు, కోట గోపి, కందాల శంకర్‌రెడ్డి, ఇట్టమళ్ల స్టాలిన్, దేవరకొండ యాదగిరి, రిటైర్డ్ తహసీల్దార్ పెరుమాళ్ల రాజారావు, బచ్చలకూరి రాంచరణ్, బొప్పాని సులేమాన్, కొల్లూరి బాబు, జానయ్య, బచ్చలి కన్నయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకులు కాకులారపు రజితాజనార్దన్, గణపురం నరేష్, సత్యనారాయణ, ఇంద్రారెడ్డి, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న వృద్ధుడిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన బొంత సైదిరెడ్డి (75) బంధువుల శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్‌పై పొనుగోడు రోడ్డులోని ఫంక్షన్ హాల్‌కి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక గుండాలమ్మ దేవాలయం సమీపంలో యూటర్న్ వద్ద సైదిరెడ్డి బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపారు.

లిఫ్టు గుంతలో పడి..



ఖాజా మొయినొద్దీన్ (ఫైల్)

నల్లగొండ: అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వ్యక్తిపై లిఫ్టు గుంతలో పడి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని అబ్బాసియా కాలనీలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం నల్లగొండ వన్ టౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. అబ్బాసియా కాలనీకి చెందిన ఖాజా మొయినొద్దీన్ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాడు. అతడు వేములపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి మొయినొద్దీన్ తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లో రెండో అంతస్తు నుంచి కిందకు దిగేందుకు లిఫ్టు వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో లిఫ్టు డోర్లు ఓపెన్ కావడంతో అతడు రెండో అంతస్తు నుంచి లిఫ్టు గుంతలో పడిపోయాడు. అనంతరం అతడిపై నుంచి లిఫ్టు పడటంతో తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. ప్రమాదం జరిగిన రెండు గంటల తర్వాత అపార్ట్‌మెంట్ వాసులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


వీధి కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

భువనగిరి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిపై వీధి కుక్కలు దాడి చేయడంతో గాయపడ్డాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డినాయక్ తండాకు చెందిన జేత్యానాయక్ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై భువనగిరికి వస్తున్నాడు. మార్గమధ్యలో నాగిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకోగానే వీధి కుక్కలు అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైతుల ఆశలు.. అడియాసలు



నక్కలగండి ప్రాజెక్టు వ్యూ



ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో వృథాగాపోతున్న నీరు

- 90 శాతం పూర్తయిన నక్కలగండి కట్ట నిర్మాణం
- చివరి నిమిషంలో చిన్నచిన్న సమస్యలతో నిలిచిన పనులు
- ఏడాదికి 3 టీఎంసీల నీరు వృథా

చందంపేట: దేవరకొండ నియోజకవర్గంలోని సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో 2008లో పురుడు పోసుకున్న నక్కలగండి ప్రాజెక్టు పనులు చిన్న చిన్న అవాంతరాలతో ఆగిపోయాయి. దీంతో ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి కష్టాలు తీరుతాయని ఆశపడుతున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది.

2008లో మొదలైన పనులు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సానుకూల నిర్ణయంతో 2008లో నక్కలగండి ప్రాజెక్టు నిర్మాణానికి పునాదులు పడ్డాయి. అడుగడుగునా అవాంతరాలను అధిగమిస్తూ వస్తున్నప్పటికీ ప్రాజెక్టు మాత్రం పూర్తి కావడం లేదు. శ్రీశైలం సొరంగం నుంచి వచ్చే నీటితో పాటు డిండి ప్రాజెక్టు మిగులు జలాలు నిల్వ చేసి దేవరకొండ నియోజకవర్గంలోని సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటిని సరఫరా చేసేలా ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. సుమారు 7.64 టీఎంసీల సామర్థ్యమున్న ఈ ప్రాజెక్టుకు మొత్తం 17 గేట్లు ఉండనున్నాయి. ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో ప్రతి ఏడాది సుమారు 3 టీఎంసీల నీరు వృథా అవుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నెరవేరని రైతుల కల..

గత 17 ఏళ్లలో నక్కలగండి కట్ట నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తయినప్పటికీ మిగతా 10 శాతం పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, రోడ్డు మార్గం ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు మినహా పెద్దగా చెప్పుకోదగ్గ అవాంతరాలంటూ ఏమీ లేకున్నప్పటికీ ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం సొరంగ ప్రమాదం కారణంగా ఈ నక్కలగండి కట్టకు నీటి ప్రవాహం లేకున్నప్పటికీ డిండి ప్రాజెక్టు మిగులు జలాలు, ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాల ద్వారా ఈ ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని, కానీ ప్రభుత్వాధికారులు, అధికారుల ఉదాసీనత కారణంగా ప్రతి ఏడాది నీరు వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు వృథాగాపోతోంది



ప్రాజెక్టు చాలా వరకు పూర్తి చేశారు. కొన్ని పనులు చేస్తే మొత్తం పూర్తయ్యేది. ప్రతి సంవత్సరం వర్షాల వల్ల చాలా నీరు వృథాగాపోతోంది. అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తే మాకు సాగునీటి కొరత ఉండదు.

– అంగోతు నరేష్, రైతు

రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి కేంద్రం కుట్ర

- బనకచర్లకు సహకరించాలని కేంద్రం లేఖ రాయడం సరికాదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, చిత్రంలో జూలకంటి రంగారెడ్డి తదితరులు

మిర్యాలగూడ : రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రిబాయి సంతాప సభలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎండీ అబ్బాస్, సీనియర్ నాయకులు డీజీ. నర్సింగ్‌రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచి, బనకచర్ల నిర్మించడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. హన్మకొండలో నకిలీ రైతులు, భూమి లేకుండా ధాన్యం అమ్మకపోయినా ప్రభుత్వ సొమ్ము రూ.1.86 కోట్లు కాజేశారని ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని వాటిలో ఏ ఒక్కటి సక్రమంగా అమలు కావడం లేదన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ చట్టబద్ధత కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ చేయబోతుందని, అది సరిపోదని అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ట్రంప్ భారతదేశంపై అనేక సుంకాలు విధిస్తున్నా మోదీ మెతక వైఖరి వహించడం సరికాదన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సోయాబీన్, పత్తి, మాంసం, పాల వంటి వ్యవసాయ ఉత్పత్తులను భారతదేశానికి దిగుమతి చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడని, అలా చేస్తే దేశంలో వ్యవసాయం కుంటుపడుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, పరుశ రాములు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు నిలిచిపోయిన వాహనాలు

బీబీనగర్: బీబీనగర్ మండలంలోని గూడూరు పరిధిలో గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. వీకెండ్ కావడంతో పాటు వివాహ శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. దీంతో టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

ఎలక్ట్రికల్ షాపు గోదాంలో అగ్ని ప్రమాదం



గోదాంలో కాలిపోయిన సామగ్రి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేటలో ఎలక్ట్రికల్ షాపు గోదాంలో ఆదివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌పేటలో ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు వెంట ఉన్న శ్రీలక్ష్మి పవన్ ఎలక్ట్రికల్స్, విజయలక్ష్మి ఆటోమోటివ్స్‌కు సంబంధించిన గోదాం నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పొగలు రావడంతో పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ నిర్వాహకులు గోదాం యజమానులకు సమాచారం అందించారు. వారు వచ్చి తాళాలు తీసి చూడగా అప్పటికే షాపు మొత్తం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నామని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

హాలియా: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన పాతనబోయిన నాగయ్య, పెద్ద మొగులమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పాతనబోయిన నవీన్(30) స్థానికంగా ఓ రైస్ మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి నవీన్ తన ఇంట్లోని ఓ గదిలో నిద్రించగా తల్లిదండ్రులు, సోదరుడు మరో గదిలో నిద్రించారు. ఈ క్రమంలో నవీన్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం వరకు గదిలో నుంచి నవీన్ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తీసి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. గృహ నిర్మాణం కోసం చేసిన అప్పులతో నవీన్ గత కొంతకాలంగా మానసిక ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకనే నవీన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైట్ ఇంజనీర్‌పై దాడి

తిప్పర్తి: తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు సమీపంలో రోడ్డు పనులు చేయిస్తున్న సైట్ ఇంజనీర్‌పై స్థానికుడు దాడి చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం .. ఇండ్లూరు గ్రామం వద్ద చేపడుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనుల్లో భాగంగా ఆదివారం సైట్ ఇంజనీర్ నూకరాజు సీసీ రోడ్డు వేయిస్తుండగా.. ఇండ్లూరు గ్రామానికి చెందిన దొడ్డబోయిన సైదులు తన ఇంటి ముందు కాంక్రీట్ వేయాలని కోరాడు. ప్రభుత్వ కొలతల ప్రకారమే వేస్తామని సైట్ ఇంజనీర్ బదులు ఇవ్వగా.. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సైదులు నూకరాజుపై దాడి చేయడంతో అతడి తలకు గాయమైంది. ఈ ఘటనపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో, ఆర్‌అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

నీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడో..?

- చివరిసారిగా 2006లో ఎన్నికల నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వాలు
- అధ్వాన్నంగా మారుతున్న చెరువులు



పెద్దవూర మండలంలోని నాయినివానికుంట చెరువు

పెద్దవూర: గత పదిహేడేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో చెరువులు అధ్వాన్నంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా.. వాటిపై అజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతులపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి విడుదల పర్యవేక్షణ పనులను నీటి సంఘాల పాలకవర్గాలు చేపట్టేవి. పదిహేడేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ పర్యవేక్షణ కరువైంది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకముందే నిధులు కాజేశారన్న ఆరోపణలు వచ్చాయి.

గతంలో ఇలా..

గత ప్రభుత్వాలు 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవి. ఈ ఎన్నికల్లో రైతులు నీటి సంఘం చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో సాగు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు సైతం చేపట్టేవారు. గత 17 ఏళ్ల నుంచి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. కొన్ని చెరువుల తూములు, పంట కాలువలు, అలుగులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పనిచేయక సాగునీరు రాక నిరుపయోగంగా మారాయి. చెరువులపై ఎవరి అజమాయిషీ లేకపోవడంతో రైతులకు సాగునీరు అవసరమయ్యే సమయంలో(వానాకాలం సీజన్ ప్రారంభంలో) చేపలు పట్టుకోవడం కోసం రాత్రికి రాత్రే చెరువుల నుంచి నీటిని అక్రమంగా వదిలి ఖాళీ చేస్తున్నారు.

2008 నుంచి ఎన్నికలు బంద్

2006వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రవ్యాప్తంగా వంద ఎకరాల ఆయకట్టుకు పైగా ఉన్న ప్రధాన చెరువులకు రెండు సంవత్సరాల కాలానికి గాను సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటినుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాల పాలకవర్గాలు ఉండటం వలన నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివృద్ధి చేసినా అజమాయిషీ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలి.

– చెన్ను వెంకటరెడ్డి, రైతు, బట్టుగూడెం, పెద్దవూర మండలం

పేదల జోలికి వస్తే ఊరుకోం



తాళ్లగడ్డలో స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వం పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఆయన పర్యటించారు. తాళ్లగడ్డలోని మల్లెతోట వద్ద ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని నిరుపేదలకు అమ్మారని, అది ప్రభుత్వ భూమి అంటూ అధికారులు పేదలను ఖాళీ చేయించాలని చూడడం సరికాదన్నారు. అష్టకష్టాలు పడి కూడబెట్టుకున్న డబ్బులతో భూమిని కొనుగోలు చేసుకొని ఇండ్లు నిర్మించుకుంటే ఇప్పుడు స్వాధీనం చేసుకుంటామనడం దారుణమన్నారు. పేదల పక్షాన నిలబడి వారికి పట్టాలు వచ్చేంతవరకు పోరాటాలు చేస్తామన్నారు. తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో 20 సంవత్సరాల క్రితం ఇండ్లు నిర్మించుకున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. కాలనీలో డ్రైనేజీ, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, కోడిరెక్క మల్లయ్య, అరుణ, కరీం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

భువనగిరి: మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల మినీ శిల్పారామంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నాట్యగురువు ప్రవలిక శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. వివిధ అంశాలపై చేసిన నృత్యప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నృత్య కళాకారులు యుక్త, నక్షత్ర, హంసిని, చిన్మయి, అనన్య, సహస్ర, వేదిక తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు 2018 క్యూసెక్కుల వరద

కేతేపల్లి: ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం వరకు 2018 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు ఒక క్రస్టు గేటును ఎత్తి 1319 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలకు 341 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా నీటిమట్టాన్ని 645 అడుగుల వద్ద స్థిరంగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరదను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.30 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ధాన్యంపై దండెత్తిన వానర సైన్యం



అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం శివారులోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో రైతులు అమ్ముకునేందుకు తెచ్చి పోసిన ధాన్యం రాశులపై కోతులు ఎగబడుతున్నాయి. ఆరబోసిన ధాన్యంపై కోతుల మంద అటు ఇటు తిరుగుతూ చిందరవందర చేస్తున్నాయి. ఆదివారం కోతులను వెళ్లగొట్టడానికి రైతులు ప్రయత్నించగా వారి వెంటపడి దాడికి యత్నించాయి. కోతుల బెడద నుంచి తమ పంటను రక్షించాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతరాలు లేని విద్య అందించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రామగిరి(నల్లగొండ): సమాజంలో సమూల మార్పు వచ్చేదాకా అంతరాలు లేని విద్యను అందించాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'విద్యలో అంతరాలు, అసమానతలు తొలగిపోయేదెట్లా?' అంశంపై ఆదివారం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసి ప్రజలను ఆలోచింపజేయాలనే ఉద్దేశంతో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కవులు సమాజ నిర్దేశకులని వారి ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. ఆరు దశాబ్దాల క్రితం కొఠారి కమిషన్ చెప్పిన కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెడితేనే విద్యారంగంలోని అసమానతలు పోతాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి కవి సమ్మేళనాలను రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతామని, మొదటిది హైదరాబాదులో నిర్వహించగా రెండోది నల్లగొండలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కవితా సంకలనాలు పుస్తకంగా తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యామ్ మాట్లాడుతూ సమాజంలో అనేక అంతరాలు ఉన్నప్పటికీ, విద్యారంగంలో అసమానతలు ఉండటం వల్ల విలువలు పతనమవుతున్నాయన్నారు. వాటిని కాపాడుకుంటూనే సమాన విద్య కోసం కవులు, రచయితలు సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. టీపీవీఎస్ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు సాగర్ల సత్తయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బైరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.